క్లుప్తంగా

ఎంఎస్‌ఎంఈ సర్వేను వేగవంతం చేయాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ సుమిత్రమ్మ

పగిడ్యాల: గ్రామాల్లో చేపట్టిన ఎంఎస్‌ఎంఈ సర్వే, జియో ట్యాగింగ్ కోఆర్డినేటషన్ సర్వేను ఎన్యుమరేటర్లు వేగవంతం చేయాలని ఎంపీడీఓ సుమిత్రమ్మ సూచించారు. శుక్రవారం సంకిరేణిపల్లె గ్రామ సచివాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సర్వే వివరాలను తెలుసుకున్నారు. ఎంఎస్‌ఎంఈ సర్వేపై నిర్లక్ష్యం తగదని, సకాలంలో సర్వేను పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శి, సిబ్బందిని ఆదేశించారు. ఎంపీడీఓ వెంట ఈఓఆర్డీ నాగేంద్రయ్య, పంచాయతీ కార్యదర్శి కోట్ల వెంకటేశ్వర్లు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

కలెక్టర్‌ను కలిసిన శ్రీశైలం ఈఓ



జిల్లా కలెక్టర్‌ని కలిసిన శ్రీశైలం ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారిగా బాధ్యతలు స్వీకరించిన ఎం.శ్రీనివాసరావు శుక్రవారం జిల్లా కలెక్టర్ రాజకుమారిని కలిశారు. నంద్యాలలో కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకే అందజేశారు. కలెక్టర్‌కు వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఈఓ స్వామి అమ్మవార్ల ప్రసాదాలను, జ్ఞాపికను అందించి సత్కరించారు. శ్రీశైల దేవస్థానం అభివృద్ధిపై చర్చించారు.

బాధ్యతగా విధులు నిర్వర్తించాలి



ఎర్రన్న, శ్రీనువాసులును సన్మానించిన ఎస్‌ఐ, సిబ్బంది

పాములపాడు: పోలీసులు బాధ్యతగా పని చేయాలని, అప్పుడే గుర్తింపు ఉంటుందని ఎస్‌ఐ సురేష్‌బాబు అన్నారు. స్థానిక పోలీసు స్టేషన్ నుంచి సంజామల మండలానికి హెడ్‌కానిస్టేబుల్ ఎర్రన్న, ఆత్మకూరు యూపీఎస్‌కు శ్రీనువాసులు బదిలీ అయ్యారు. ఈ మేరకు వారిని ఘనంగా సన్మానించారు. పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ ఏసన్న, హెడ్ కానిస్టేబుల్స్ రమణ, అల్లాబకాష్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నీటిముంపు నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలి



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న నీటిముంపు నిరుద్యోగులు

కొత్తపల్లి: శ్రీశైలం జలాశయం నిర్మాణంలో భూములు కోల్పోయిన మండలంలోని నీటిముంపు నిరుద్యోగులకు 98 జీఓ ద్వారా ఉద్యోగాలు కల్పించాలని నీటిముంపు నిరుద్యోలు బొల్లు ప్రసాద్‌బాబు యాదవ్, నాగర్జునగౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ 1609 మంది నీటిముంపు నిరుద్యోగులు ఉండగా అందులో 965 మందికి ఉద్యోగాలు ఇచ్చారని, మిగిలిన 645 మందిరి ఉద్యోగాలు కల్పించి న్యాయం చేయాలని కోరారు.

పల్లకీలో ఆదిదంపతుల విహారం



మహానందిలో పల్లకిసేవ దృశ్యం

మహానంది: మహానందిలో కొలువైన కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లకు శుక్రవారం రాత్రి పల్లకీసేవ నిర్వహించారు. ఆలయ ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, శాంతారాంభట్, హనుమంతు శర్మ, అర్చకులు శరభయ్యశర్మలు స్వామి, అమ్మవారికి విశేష పూజలు చేపట్టారు. అనంతరం ఆలయ ప్రాకారాల్లో పల్లకీ ఉత్సవాన్ని చేపట్టగా పలు ప్రాంతాల భక్తులు పల్లకీని మోస్తూ భక్తిశ్రద్ధలతో ఓం నమో మహానందీశ్వరాయ...అంటూ ప్రణమిల్లారు.

నేడు మెగా పేరెంట్ - టీచర్ మీట్

బండి ఆత్మకూరు: మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం మెగా పేరెంట్ - టీచర్ మీటింగ్ నిర్వహించనున్నట్లు ఎంఈఓలు జి.మోహన్‌రెడ్డి, ఆర్.యశోద శుక్రవారం తెలిపారు.

బడుగుల ఆశాజ్యోతి అంబేడ్కర్



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న డాక్టర్ దార సుధీర్, నాయకులు

నందికొట్కూరు: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దార సుధీర్ అన్నారు. శుక్రవారం గ్రామీణ, పట్టణంలోని ఆయా ప్రాంతాల్లో అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా విగ్రహాలకు, చిత్ర పటాలకు ప్రజా, కుల సంఘాలు, రాజకీయ నాయకులు పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపాలిటీ కార్యాలయం ఆవరణలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి కమిషనర్ కిషోర్, కౌన్సిలర్లు, సిబ్బంది పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మన్సూర్, నాయకులు ఉపేంద్రారెడ్డి, జబ్బార్, అబుబక్కర్, మల్లయ్య, బొట్టు రవి, రాజు, రవి, విజ్జి, లక్ష్మిరెడ్డి, సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: మండల కేంద్రం జూపాడుబంగ్లాలో శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధింతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి అంబేడ్కర్ యువజన సంఘం నాయకుడు ఆర్ఎంపీ ఎర్రన్న తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కృపాకపర్, చిన్నమల్లయ్య, సీసీ గాంధీ, అశోకరత్నం, పెద్దమల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

పాములపాడు: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని తహసీల్దార్ సుభద్రమ్మ, డాక్టర్ నాగన్న అన్నారు. శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా స్థానిక బస్టాండ్ సర్కిల్‌లో ఆయన విగ్రహానికి పూల మాల వేసి నివాళ్లులర్పించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు అబ్రహం, అంకన్న, స్వాములు, సంజీవరాయుడు, శంకర్‌గౌడు, రఘురామూర్తి, జాన్‌బాబు, బతుకులయ్య తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ

పాములపాడు: మండలంలోని తుమ్మలూరు గ్రామంలో కేజీ రోడ్డు ప్రక్కన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య శుక్రవారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచు వరప్రసాద్, తహసీల్దార్ సుబద్రమ్మ, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఏఓ ఫణీశ్వరరెడ్డి, జేఈ రాఘవేంద్రప్రసాద్, పీఎస్‌కే సీఈఓ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలను సాధించాలి

ఆత్మకూరు: అంబేడ్కర్ ఆశయాలను సాధించాలని కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్, గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు నరసింహనాయక్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని సుదర్శనవర్మ భవనంలో అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో కుల వివక్షత, అంటరానితనం నిర్మూలనకు అంబేడ్కర్ ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రాముడు, సుధాకర్, రామన్న, ప్రసాద్, వెంకటరాముడు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు నివాళి



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న విద్యార్థులు, గ్రామస్తులు

శ్రీశైలంప్రాజెక్ట్: అంబేడ్కర్ వర్ధంతిని శుక్రవారం సున్నిపెంటలో నిర్వహించారు. షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా నడుచుకుందామని నినదించారు. కార్యక్రమంలో ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు గొట్టెముక్కుల ప్రకాశ్, వేశపోగు లక్ష్మయ్య, పిల్లి వెంకటేశ్వర్లు, ఎం.డేవిడ్, రాజేంద్రప్రసాద్, ఎలకపాటి ఆశీర్వాదం, దొండపాటి అచ్చయ్య, రాయల విజయ్, ఈశ్వరయ్య, పులిరాజు, పి.మల్లికార్జున, ఎం.చిన్న, డి.రవీంద్ర పాల్గొన్నారు.

వెలుగోడు: స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం అంబేడ్కర్ చిత్రపటానికి సర్పంచ్ వేల్పుల జైపాల్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి రఘురాముడు యాదవ్, ఖలీల్ ఖాన్, రాయప్ప తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కేవీపీఎస్ నాయకులు



సున్నిపెంటలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న ఎస్సీ వెల్ఫేర్ నాయకులు



మాట్లాడుతున్న సర్పంచ్ వేల్పుల జైపాల్

ఏ.కోడూరులో..

బండి ఆత్మకూరు: మండలంలోని ఏ.కోడూరు గ్రామంలో అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ జ్ఞానాభరణం, మాజీ సైనికుడు నాగరాజు, కమ్యూనిస్ట్ నాయకుడు డేవిడ్‌తో పాటు గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కల్యాణకట్టను పరిశీలించిన ఈఓ



కళ్యాణ కట్టలో సిబ్బందికి సూచనలు చేస్తున్న ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం శ్రీనివాసరావు శుక్రవారం కల్యాణకట్టను పరిశీలించారు. ముందుగా కల్యాణకట్ట కౌంటరును తనిఖీ చేశారు. కౌంటర్లో విక్రయించిన టికెట్లతో నగదు సరిపోల్చి చూశారు. తరువాత సిబ్బందితో మాట్లాడుతూ భక్తులతో మర్యాదగా మెలగాలన్నారు. సమయపాలన పాటించాలన్నారు. వస్త్రధారణ సంప్రదాయపద్ధతిలో ఉండాలన్నారు. ఏకరూప దుస్తులు ధరించాలని ఆదేశించారు. కేశఖండనానికి వచ్చే భక్తులు అధికసమయం వేచివుండకుండా చూడాలని అధికారులకు సూచించారు. కల్యాణకట్టను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కల్యాణకట్టలో విద్యుద్దీపాలు, ఫ్యాన్లు పనిచేసే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కల్యాణకట్ట వద్ద భక్తులతో సంభాషించి దేవస్థానం కల్పిస్తున్న సౌకర్యాలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు.

మహానందికి ఫెంగల్ ఎఫెక్ట్



ఖాళీగా ఉన్న ఆలయ ప్రాంగణం

మహానంది: నిత్యం భక్తులతో కళకళలాడే మహానంది ఆలయం పరిసరాలు ఫెంగల్ తుఫాన్ ఎఫెక్ట్‌తో వెలవెలబోయాయి. మూడు రోజుల నుంచి వర్షాలు కురుస్తుండటంతో భక్తులు పెద్దగా రాలేదు. దీంతో శుక్రవారం భక్తులు లేక ఆలయ ప్రాంగణాలు నిర్మానుష్యంగా కనిపించాయి. ఉదయం, సాయంత్రం కొంతమంది అయ్యప్ప దీక్షా స్వాములు, సాధారణ భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

తోలుతీస్తా .. నాటకాలు ఆడుతున్నారా?

- అధికారులపై ఎమ్మెల్యే జయసూర్య ఫైర్




సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

కొత్తపల్లి: సామాన్యుడి మొదలు అధికారి వరకు అధికారపార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు బెదిరింపులకు దిగుతున్నారు. తమ మాటే శాసనమని చెప్పింది చేయాలని హుకుం జారీ చేస్తున్నారు. తాజాగా టీడీపీకి చెందిన నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తాజయసూర్య అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో ఎంపీపీ కిచ్చన్నగారి కుసుమలత అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కొన్ని శాఖల అధికారుల స్థానంలో వారి సిబ్బంది హాజరు కావడంపై ఫైర్ అయ్యారు. ఇక నుంచి సమావేశాలకు అధికారులు హాజరుకాకపోతే తోలుతీస్తానని..అధికారిక కార్యక్రమాలకు రాకుండా నాటకాలు ఆడుతున్నారా అంటూ మండిపడ్డారు. సర్వసభ్య సమావేశానికి హాజరు కాని వారికి వెంటనే నోటీసులు ఇచ్చి శాఖపరమైన చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ మేరికి ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి, తహసీల్దార్ ఉమారాణి, ఏపీఎం పుల్లయ్య, ఎంఈఓ ఇనాయతుల్లా, ఐసీడీఎస్ ఏసీడీపీఓ మంగవల్లీ, పశువైద్యాధికారి భువనేశ్వరి, వైద్యులు విజయేంద్ర, మహమ్మద్‌బేగ్, ఏఓ మహేష్, ఏపీఓ హరికృష్ణ, హార్టికల్చర్ అధికారి చందన, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జుబేర్, పీఆర్ ఏఈ మద్దిలేటి, వైస్ ఎంపీపీ–2 జయమ్మ, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రాయితీతో సోలార్ నిర్మించుకోండి

వెలుగోడు: రాయితీతో ఇంటిపై సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకుంటే విద్యుత్ బిల్లు ఆదా చేసుకోవచ్చని ఏఈ రవీంద్రనాయక్ సూచించారు. శుక్రవారం విద్యుత్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం కింద గృహ వినియోగదారులకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుందన్నారు. గృహ వినియోగదారులు సోలార్ వాడటం వల్ల అతి తక్కువ విద్యుత్ బిల్లు వస్తుందన్నారు. ఇంటిపై కప్పుపై కనీసం 10 చదరపు మీటర్లు/100 చదరపు అడుగుల స్థలంలో వన్ కిలో వాట్ సామర్థ్యం కలిగిన సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. గృహ వినియోగదారులు సోలార్ నిర్మించుకోవాలంటే తక్కువ వడ్డీకే బ్యాంకు రుణాలు లభిస్తాయన్నారు. సోలార్ ఒక కిలో వాట్ 120 యూనిట్లు ఉత్పత్తి కాగా వినియోగదానికి ప్రస్తుతం వస్తున్న బిల్లు రూ.1000, అదే సోలార్‌లో ఏర్పాటు చేసుకున్న తర్వాత వచ్చే బిల్లు రూ.338, ఏడాదికి రూ.8,000 ఆదాతో పాటు ప్రభుత్వం నుంచి రూ.30 వేలు రాయితీ వస్తుందన్నారు.

ముగిసిన ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమాలు



విద్యార్థులకు బహుమతులు ఇస్తున్న దృశ్యం

మహానంది: అల్లినగరంలో వారం రోజులుగా జరిగిన ఎన్‌ఎస్‌ఎస్ సేవా కార్యక్రమాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జయలక్ష్మి మాట్లాడుతూ కళాశాల ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎం.లక్ష్మీదేవి, ఎన్‌ఎస్‌ఎస్ పీఓ డాక్టర్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

పంట నమోదు త్వరగా పూర్తి చేయాలి



రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ పవన్ కుమార్

వెలుగోడు: మండలంలో పంట నమోదు త్వరగా పూర్తి చేయాలని మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ సిబ్బందికి సూచించారు. శుక్రవారం వెలుగోడు రైతు సేవ కేంద్రంను ఏఓ తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ రబీలో సాగుచేసిన పంటల వివరాలు ఈ పంట నమోదు త్వరగా పూర్తిచేయాలని సిబ్బందిని ఆదేశించారు. రబి పంట బీమాకు రైతులు ప్రీమియం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ సుధారాణి పాల్గొన్నారు.

భూసమస్యలు పరిష్కరిస్తాం

- ఆత్మకూరు ఆర్డీఓ నాగజ్యోతి



సమావేశంలో మాట్లాడుతున్న ఆత్మకూరు ఆర్డీఓ నాగజ్యోతి

జూపాడుబంగ్లా: రైతులు, ప్రజలు లిఖితపూర్వకంగా తగిన ఆధారాలతో రెవెన్యూ సదస్సుల్లో ఫిర్యాదు చేస్తే వారంలోగా వారి భూసమస్యలను పరిష్కరిస్తామని ఆత్మకూరు ఆర్డీఓ నాగజ్యోతి తెలిపారు. శుక్రవారం మండలంలోని మండ్లెం గ్రామసచివాలయం వద్ద రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆత్మకూరు ఆర్డీఓ నాగజ్యోతి మాట్లాడుతూ ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతామని, రైతులతోపాటు ప్రజలు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పుట్టల కృపమ్మ, డీటీలు నాగన్న, సత్యదీప్, సర్వేయర్ అతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరు: రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలను పరిష్కరించాలని డీఆర్‌డీఏ పీడీ, మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని నాగటూరు గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సదస్సుకు హాజరైన పీడీ మాట్లాడుతూ ప్రతి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రజల నుంచి 15 అర్జీలు వచ్చాయని రెవెన్యూ అధికారులు తెలిపారు. సదస్సులో తహసీల్దార్ శ్రీనివాసులు, డీటీలు, సర్వేయర్లు, ఆర్‌ఐలు, వీఆర్వోలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: గ్రామాలలో రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలకు చెక్ పెడతామని ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ అధికారి నాగజ్యోతి, ప్రత్యేకఅధికారి చింతామణి తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని దుద్యాల గ్రామంలో తహసీల్దార్ ఉమారాణి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఎమ్మెల్యే గిత్తా జయసూర్య రెవెన్యూ సదస్సును తనిఖీ చేశారు. ప్రజల సమస్యలకు పరిష్కారం చూపాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న, సర్పంచ్ శోభలత, ఎంపీపీ కుసుమలత, జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి, ఎంపీటీసీ రమిజాబీ, రైతులు పాల్గొన్నారు.

పాములపాడు: మండలంలోని చెలిమిల్ల గ్రామంలో శుక్రవారం తహసీల్దార్ రత్నరాధిక, ప్రత్యేకాధికారి రాజు రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తమ భూములను ఆన్‌లైన్ చేయాలని గ్రామానికి చెందిన గాజుల లింగన్న, నడిపి రాముడు, ఎనబోతుల లక్ష్మిదేవి, బత్తుల అచ్చయ్య వినతులు సమర్పించారు. ఆర్డీ నాగజ్యోతి రెవెన్యూ సదస్సును పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పఠాన్‌బాబు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పగిడ్యాల: మండల కేంద్రం పగిడ్యాల ఒకటవ గ్రామ సచివాలయం ఆవరణలో శుక్రవారం తహసీల్దార్ శివరాముడు అధ్యక్షతన రెవెన్యూ సదస్సు జరిగింది. సదస్సుకు మండల ప్రత్యేక అధికారి, సెరికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ పరమేశ్వరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ నేపథ్యంలో 1933లో కొనుగోలు చేసిన భూమికి సంబంధించి 0.35 సెంట్లు మిగులు భూమిగా చూపిస్తున్నారని, ఆన్‌లైన్ చేయాలని రైతు రాయపు సర్వేశ్వరరెడ్డి విన్నవించారు. ఏళ్లతరబడి తిరుగుతున్నా పరిష్కారం కావడం లేదని వాపోయాడు. కార్యక్రమంలో ఆర్‌ఐ శ్రీరంగారెడ్డి, మండల సర్వేయర్ జ్ఞానప్రకాష్, ఈఓ లక్ష్మీనారాయణ, వీఆర్వోలు నాగన్న, వెంకటస్వామి, గ్రామ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులు

వెలుగోడు: సమస్యలు పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు స్పెషల్ ఆఫీసర్ నాగమహేశ్వరి తెలిపారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన రెవెన్యూ సదస్సులో ఆమె మాట్లాడారు. రెవెన్యూ సదస్సులో ప్రజలు, రైతులకు సంబంధించిన ఆన్‌లైన్, అడంగల్, భూ సమస్యలు పరిష్కరించుకోవచ్చన్నారు. 29 దరఖాస్తులు సదస్సులో వచ్చినట్లు తహసీల్దార్ శ్రీనివాస గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ వేల్పుల జయపాల్, సీనియర్ అసిస్టెంట్ వెంకటరామిరెడ్డి, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఇందిరేశ్వరం గ్రామంలో ..

ఆత్మకూరు: మండలంలోని ఇందిరేశ్వరం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సు వెలవెలబోయింది. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగిన రెవెన్యూ సదస్సుకు ప్రజల నుంచి స్పందన కరువైంది. కేవలం ఆరు దరఖాస్తులు మాత్రమే అందాయి. ఈ సందర్భంగా తహసీల్దార్ రత్నరాధిక మాట్లాడుతూ రైతులు భూ తగాదాలు, భూ సమస్యలపై రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తులు సమర్పిస్తే విచారించి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. గ్రామ సర్పంచ్ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

బుక్కాపురంలో..

మహానంది: బుక్కాపురంలో తహసీల్దార్ రమాదేవి ఆధ్వర్యంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఉదయం పది గంటలకు ఎవరూ లేకపోగా ఒక రైతు మాత్రమే కనిపించారు. తర్వాత కొందరు రైతులు వచ్చి దరఖాస్తులు ఇచ్చి వెళ్లారు. మధ్యాహ్నం సమయంలో ఎవరూ లేకపోవడంతో వీఆర్‌ఓలు, సిబ్బంది కబుర్లు చెప్పుకుంటూ కనిపించారు. ఉదయం నుంచి అధికారులు సదస్సులోనే ఉండాల్సి ఉండగా కేవలం వీఆర్‌ఓలు, సిబ్బంది మాత్రమే ఉండటం గమనార్హం. నలుగురు పాసుపుస్తకాల కోసం, నలుగురు సర్వే కోసం, మరో ముగ్గురు రస్తా ఆక్రమణలపై దరఖాస్తులు అందించినట్లు వీఆర్‌ఓ తెలిపారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి



రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న స్పెషల్ ఆఫీసర్ నాగమహేశ్వరి



కొత్తపల్లి: వినతులు స్వీకరిస్తున్న అధికారులు



మహానంది: కబుర్లు చెప్పకుంటున్న అధికారులు

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

నందికొట్కూరు: నిరుద్యోగులు జాబ్ మేళా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్. సునీత అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారులు చాంద్‌బాషా, వెంకటరమణ, ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్. సునీత ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. 44 మంది నిరుద్యోగులు జాబ్ మేళాకు హాజరయ్యారు. అయితే రెండు కంపెనీ ప్రతినిధులు 23 మందికి ఉద్యోగాలు కల్పిస్తూ ఎంపిక చేశారు.

మహానందిలో చిరుత

మహానంది: మహానంది ఆలయ పరిసరాల్లో శుక్రవారం రాత్రి చిరుత కనిపించడంతో భక్తులు, స్థానికులు భయాందోళనకు గురయ్యారు. గురువారం రాత్రి 11.30 గంటల సమయంలో మహానంది ఆలయం వెనుక ఉన్న కామేశ్వరీసత్రం వైపు చిరుత కనిపించడంతో అయ్యప్పస్వాములు భయంతో పరుగులు తీశారు. వారు వెంటనే సమాచార కేంద్రం సిబ్బందికి సమాచారం అందించగా భక్తులను మైకుల ద్వారా అప్రమత్తం చేశారు. తాజాగా శుక్రవారం రాత్రి మహానంది నుంచి గాజులపల్లె వెళ్లే వైపు ఉన్న పార్వతీపురం టోల్‌గేట్ వద్ద రోడ్డు దాటుతూ పొదల్లోకి వెళ్తున్న చిరుతను భక్తులు చూశారు. చిరుత సంచారంతో స్థానికులు, భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు.



రోడ్డు దాటుతున్న చిరుత

నాటుసారా విక్రయిస్తే చర్యలు తప్పవు

నందికొట్కూరు: నాటుసారా విక్రయిస్తే చట్ట పరమైన చర్యలు తప్పవని ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ సీఐ రామాంజనేయులునాయక్ హెచ్చరించారు. శనివారం మండల పరిధిలోని అల్లూరు గ్రామంలో నాటుసారా అమ్ముతున్న నీలిషికారి రాజేష్‌ను సీఐ, ఎస్‌ఐలు అదుపులోకి తీసుకున్నారు. 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ ఎస్‌ఐ జబ్రుల్లా, హెడ్ కానిస్టేబుల్ పద్మనాభం, శంకర్ నాయక్, పోలీసులు శివన్న, మధుప్రసాద్, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించండి

జూపాడుబంగ్లా: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించాలని ఎంఈఓ–1 చిన్నమద్దిలేటి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉపాధ్యాయుల విద్యాబోధన, విద్యార్థుల విద్యాభ్యాసం, వారి ప్రవర్తన, తదితర అంశాలపై తల్లిదండ్రులతో చర్చించాలన్నారు. అనంతరం వారికి ఆటపాటలు నిర్వహించాలన్నారు. తల్లిదండ్రుల సలహాలు, సూచనలు పాటించి పాఠశాలల అభివృద్ధి, ఉత్తీర్ణతశాతం పెంపు తదితర అంశాలపై చర్చించి ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు.